# స్వాహా

ఆ రోజు దినపత్రిక తిరగవేస్తున్న సుబ్బారావుకు ఉన్నట్లుండి ఒళ్ళు మండింది. పేపరు యిస్సిరి కొట్టాడు చిరాగ్గా.

గాలికి కాగితాలు చెల్లాచెదురుగా వరండాలో పడ్డాయి.

"అయ్యో! అయ్యో! ఏమిటండీ యిది? మీరు చదవగానే ఈ పేపరు పని అయిపోయిందా? నేను చదవాలి-సాయంత్రానికి యిల్లు చేరే మీ ముద్దులతమ్ములుంగారు చదవాలి- మధ్యలో పక్కింటివాళ్ళు చదవాలి-ఇంకా పనిపిల్ల సిన్మాబొమ్మలు తిరగెయ్యాలి.." దండకం చదివింది దమయంతి.

"బుజ్జిగాడ్ని మర్చిపోయినట్లున్నావు.." కొరకొరచూస్తూ అందించాడు.

"నామతిమండ! అవును వాడు దాన్ని ముక్కలుముక్కలుగా చింపాలి రాత్రికి."

"చాల్లే-ఊర్కో! వంటయిందా? ఇలా పెత్తనాలు చేస్తున్నావు?"

"నా సంగతి సరే? తమరేం అలా కుర్చీకి అతుక్కుపోయియున్నారు - కాలేజీ గట్రాలేదా?"

"ఇవ్వాళ సెలవు"

"అదేం పాపం!"

"ఎన్నికలు నిన్న జరిగాయి - అందుకని".

"నిన్న స్టూడెంట్సు ఎలెక్షన్లు జరుగుతున్నాయని సెలవిచ్చారని - తమరు నాకు సెలవిచ్చినట్లు - నేను మీకు మనవి చేస్తున్నాను." వ్యంగ్యంగా అంది.

"ఏంటే నీ గోల! వాళ్ళ కాలేజీ వాళ్ళిష్టం. చదువుకుంటే చదువుకుంటారు - లేకపోతే లేదు.."

"అంతే లేండి - వానాకాలపు చదువులని ఊరికే అన్నారా? ఊళ్ళో గేమ్సు జరిగితే సెలవు-ఆగేమ్సులో గెలిస్తే సెలవు, ఎవరైనా పోతే సెలవు - వస్తే సెలవు.." తను చదవాల్సిన నాలుగు చదివి విసవిసలు పలికి వెళ్ళింది.

కాసేపటికి కాఫీ కప్పుతో వచ్చింది దమయంతి.

"ఇంతకీ పేపరు చేసిన తప్పేంటండి?"

"చివరి పేజీలో ఆ సినిమా ప్రకటన చూశావా? ఎంత అసభ్యంగా ఉందో!" కాఫీ చప్పరిస్తూ చెప్పాడు.

"ఇది మరీ బాగుంది-ప్రకటనకు డబ్బులిస్తే వాళ్లు వేశారు- ఇందులో పేపరు తప్పేముంది?"

"అది కాదోయ్! ఇచ్చేవాళ్ళకు బుద్ధిలేకపోతే-వేసే వాళ్ళకు బుద్ధిలేదా"? తెగ రాద్ధాంతపడిపోయాడు సుబ్బారావు.

"బుద్ధిలేనివాళ్ళంతా ఒక చోట సమావేశమై - బుద్ధి గురించి నీతులు చెబుతూ ఉంటే ఆ బుద్ధి సిగ్గుపడి - తలదాచుకుందామని పారిపోయిందని నాకో బుద్ధిలేని మొద్దు చెప్పింది లేండి ఆ మధ్య" నవ్వాపుకుంటూ చెప్పింది.

"వీడికేమన్నా బుద్ధి ఉందా? పదకొండు దాటి గంటయినా రాలేదు" వీధిలోకి చూస్తూ అనుకున్నాడు.

"అదా సంగతి! తమరి నిరీక్షణ పోస్టుమాన్ కోసమా? అలా ఎన్నాళ్ళు ఎదురు చూస్తారు..? ఉత్తరంవస్తే తనేం పులుసు కాసుకుంటాడా? అస్సలు వాళ్ళురాస్తేగా?"

"లేదోయ్! ఇవ్వాళ రావాలి-నడుస్తున్నవి మంచి రోజులు-బహుశ వాళ్ళకి తిథి, వారం, నక్షత్రం పట్టింపులున్నాయేమో మనకి మల్లే- అందుకే యింతకాలం రాయలేదు-మౌఢ్యం పోయేదాకా!"

"మీ తమ్ముడు-మీ ఆశ-నాకైతే పనుంది.." అంటూ ఖాళీ అయిన కప్పును తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

సుబ్బారావు ఎదురుచూస్తున్నది ఓ శుభవార్త కోసం! అతనికో చాకులాంటి తమ్ముడున్నాడు-చిన్న వయసులోనే బ్యాంకులో మాంచి ఉద్యోగం సంపాదించాడు. స్ఫురద్రూపి! ఆరోగ్యంతో మిసమిసలాడుతూంటాడు.

ఆరోజు అతనికి బాగా గుర్తుంది..

పెళ్ళి చూపులు-ఫలహారాలు ముగిశాయి. మగపెళ్ళివారి గాంభీర్యం నిలుపుకోవాలి గాబట్టి-అమ్మాయి నచ్చినా-ఆ విషయాన్ని వెంటనే ప్రకటించలేదు.

"సుబ్బారావుగారు! మాకున్నది ఒక్కగానొక్క అమ్మాయి. మీకున్నది ఒక్కగానొక్క తమ్ముడు! మా సంప్రదాయం కూడ మీకు మల్లే వేలెత్తి చూపలేనిది. మీరు తమ అభిప్రాయం తెలియచేస్తే ముహూర్తాల గురించి ఆలోచిద్దాం!" అమ్మాయి తండ్రి సుదర్శనరావుగారు చెప్పారు వినయంగా.

"మా తమ్ముడి అభిప్రాయం కనుక్కుని వీలుచూసుకుని ఉత్తరం రాస్తాను-దాన్ని బట్టి మిగతా కార్యక్రమాలు ఆలోచిద్దాం." సుబ్బారావు సెలవు పుచ్చుకోబోయాడు.

"అన్నయ్యగారు! మా అమ్మాయికి సంగీతం కూడ నేర్పించాం చక్కగా పాడుతుంది-వీణ కూడ వాయిస్తుంది-శ్రావ్యంగా-"గర్వంగా చెప్పింది సుందరమ్మగారు.

సుబ్బారావు వెలిగిపోతున్న తమ్ముడి మొహం వంక చూశాడు. ఇంతలోగుర్తుకు వచ్చింది అతను రచైతని.

"యేమండోయ్ మా తమ్ముడేం తక్కువవాడు కాదు. వాడు రచయితండి-రచయిత, కథల్రాస్తాడు. "ఆ బ్రహ్మ విద్య యింకె వరికి రానట్లు చెప్పాడు సుబ్బారావు.

"ఆఁ! ర చ యి తా!?" దెబ్బకు బిక్క చచ్చిపోయారు.

సుబ్బారావుకు విజయగర్వం కలిగింది.

"కావాలంటే-ఫలానా వార్తాపత్రికలో-ఫలానా కథ పడింది చూసుకోండి" అంటూ వివరాలు చెప్పాడు.

ఇంటి కొచ్చింతర్వాత-తమ్ముడి అంగీకారం తీసుకుని ఉత్తరం రాశాడు కాబోయే వియ్యాల వాళ్ళకు, వాళ్ళని వచ్చి తొందరలో ముహుర్తాలు పెట్టుకొమ్మని రాశారు- అన్ని విషయాలు మాట్లాడి ఆ ఉత్తరం రాసి కూడ నెలవుతున్నది-దానికింతవరకు జవాబు లేదు.

"పోస్ట్!' అన్న గావు కేకతో ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు.

"ఏంటండీ?! కళ్ళు తెరుచుకునే నిద్రపోతున్నారు-ఎన్నిసార్లు పిలవాలి? ఇలా అయితే నేను డ్యూటి చేసినట్లే!" విసురుగా కవరు యిచ్చి వెళ్ళిపోయాడు పోస్టుమ్యాన్.

"ఏ మే! సుదర్శనరావువాళ్ళు రాశారు"ఆనందంగా లోపలికి కేక పెట్టి-కళ్ళజోడు సరిచేసుకుని-కవరుచించి ఉత్తరం బయటకు తీశాడు సుబ్బారావు.

"శ్రీయుతులు సుబ్బారావుగార్కి,

మీ సంబంధం యిప్పుడు మాకు ఆమోద యోగ్యంగా లేదని తెలుపటానికి చింతిస్తున్నాను-కారణం రాయవలసిన అవసరం లేకపోయినా-రాస్తున్నాను.

మీరు చెప్పినట్లుగా ఫలానా పత్రికలో పడ్డ మీ తమ్ముడి కథ చదివాము.

కొందరు వృత్తిరీత్యా కొందరు ప్రవృత్తి రీత్యా-ఇంకొందరు కాలక్షేపం కోసం-మరి కొందరుడబ్బుకోసం రచనలు చేస్తారు. మహానుభావులు కొందరు సంఘ సంస్కరణ కోసం కలం చేపడితే - మేధావులు కొందరు కీర్తి బావుటా ఎగర వేయటానికి నడుం కడుతారు.

కాని మీ తమ్ముడి కథ కేవలం తన పేరు అచ్చులో చూసుకోవాలని-నాలుగు పైసలు పోగు చేసుకోవాలని చేసినట్లు కనిపిస్తున్నది. అదైనా సంతోషించేవాడ్ని అడ్డదారిలో పైకి రావాలని విచ్చలవిడి శృంగారం- గుప్పించాడు దాని విషప్రభావం గురించి ఆలోచించకుండా - స్పృహ లేకుండా రాశాడు. సారీ" కొండంత ఆశలు పెట్టుకున్న బంగారం లాంటి సంబంధం చేజేతులా పోతూండే సరికి సుబ్బారావుకు షాక్ తగిలినట్లయి స్పృహ తప్పింది.

వెనుక ఉండి చదువుతున్న దమయంతి ఆతృతగా ఉత్తరం లాక్కుని చదివింది పైకి.

"– ఆ కథలోని వాతావరణం మీ యింట్లో ఉన్నట్లయితే ఆ సంస్కృతికి శతకోటి దండాలు ! అటువంటి (నీచ) పరిసరాలలో యిమడగల హృదయ వైశాల్యం మా అమ్మాయికి లేదు. ఏదో కట్టుబాట్లతో పెంచాం అలానే ఈ జన్మ వెళ్లిపోవాలని ఆశిస్తున్నాం-

చివరిగా ఓ సలహా-

అన్నగా మీకున్న బాధ్యతను స్వీకరించి, మీ తమ్ముడు రాసే కథల ప్రభావం మీ యింటిమీద- మీ యిల్లాలి వంటి మీద వాలకుండా చూసుకోండి-మీ శ్రేయోభిలాషి"కోపంతో ఉడికిపోతూ ఉత్తరం నలిపి సుబ్బారావు మీద పడేసింది దమయంతి.

ఎదురుగా కనిపిస్తున్న పేపరు అందుకుని కసిగా కసాబిసా ముక్కలుగా చింపిపారేసింది దమయంతి.

అప్పుడు చూసింది సుబ్బారావు మొహం వంక.

సుబ్బారావుకు యింకా స్పృహరాలేదు.స్పృహ వస్తుందా?!

**(జాగృతి 2-8 ఏప్రిల్ 1990)**

